క్లుప్తంగా

సీసలిలో 'నా మట్టి నా దేశం'



సీసలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాళ్ల: అజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని కాళ్ల మండలం, సీసలి మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఆనందోత్సాహాలతో, మేళ తాళాల నడుమ జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకుల చిత్ర పటాలతో ప్లకార్డులు చేత పట్టుకుని ప్రత్యేకంగా తయారుచేసిన కలశంలో మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎస్.విజయలక్ష్మి, సీఆర్‌పీ బి.ప్రకాష్‌బాబు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

సాక్షి, భీమవరం: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక కోర్టు వద్ద బార్‌అసోసియేషన్, ఐఏఎల్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, కార్యదర్శి పాకా రమేష్ మాట్లాడుతూ న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలుచేయాలని, లైఫ్ ఇన్‌స్రూ మరణాంతరం రూ.12 లక్షలు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ప్రతి నెలా రూ.5 వేలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఏపీపీ, పీపీ, ఏజీపీ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు వైవీ ఆనంద్, పాలా రాఘవేంద్రరావు, నాగబాబు, వై.న్యూటన్, వి.సుబ్బారావు, వీరవల్లి శ్రీను, బాబ్జి, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు చిలకమర్తి

అత్తిలి: కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆధునిక కవులలో మేటి అని, సమకాలీన సమస్యలపై ఆయన తన రచనల ద్వారా పోరాటం చేసారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిలకమర్తి లక్ష్మీనరశింహం జయంతిని మంగళవారం ఘనంగా జరిపారు. ఈసందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ చిలకమర్తివారు నిమ్నజాతుల వారికి విద్యకోసం, ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేశారని, వీరి కృషిఫలితంగా సంఘంలో మార్పువచ్చిందన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, డీఎంజీ ప్రసాద్, లలిత, సుభద్ర, నాగేశ్వరరావు, హర్షద్, మాధవ పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టి పెట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ హాస్టల్స్‌లో సలహా సంఘ సమావేశాలు, పేరెంట్స్‌కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నర్సాపురం, సహాయ సాంఘీక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ

ఆకివీడు: పేదలకు అందుబాటులో వైద్య సేవలందించిన దివంగత మండపాటి రఘునాథరాజు ఐదో వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఎస్ టర్నింగ్ వద్ద నిర్వహించారు. కొల్లేరు తీర ప్రాంత ప్రజలకు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు తక్కువ ధరకు మెరుగైన వైద్యం రఘునాథరాజు అందించారని పలువురు కొనియాడారు. ప్రైవేటు గోదాముల అధినేత కేఆర్‌కే మూర్తిరాజు ఆర్థిక సహకారంతో పేద మహిళలకు చీరలు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ అరుణకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

జగనన్న భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు, భూసర్వే ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయసలహామండలి జిల్లా, మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. మండల తహసిల్దార్ జీవీ శేషగిరిరావు ఆధ్వర్యంలో సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బందితో కలిసి జట్లపాలెం సచివాలయం వద్ద మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గుండుమోగుల సాంబయ్య, మునీంద్ర, కట్టుబోయిన నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి, గ్రామ సర్పంచ్ ఇండవల్లి మణిరాజు, ఉపసర్పంచ్ చెరుకు హనుమంతు, వీఆర్వోలు ప్రభువరం, సురేష్, వీపీఏలు శ్యాంబాబు, శ్వేత, డీటీలు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

- 250 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు
- నగర పంచాయతీ వైస్ చైర్మన్ పండు



స్థానిక సరోజినీనాయుడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



యనమదుర్రులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీకాంతం

ఆకివీడు: విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడంతో మెరుగైన ఆరోగ్యంతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల సత్యనారాయణ(పండు) చెప్పారు. స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ నాలుగేళ్లుగా విద్యార్థులకు అందజేస్తున్న నాణ్యమైన గోరుముద్ద మంచి ఫలితాల్ని ఇస్తుందన్నారు. పోషక విలువలు, విటమిన్లు ఉండటంతో దృష్టి లోపాలకు అవకాశం లేకుండా ఉందన్నారు. మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆధునిక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విధానంలో కొత్త మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. పేద, మధ్యతరగతి పిల్లల్ని పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీలో చేరిన మూడేళ్ల చిన్నారి దగ్గర నుంచి ఉన్నత చదువులు చదివే విద్యార్థుల వరకూ ప్రభుత్వమే అన్ని వసతులూ కల్పిస్తుందని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు ఏ. ఇందిర మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను వివరించారు. ఆరోగ్య సురక్షలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్టు హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

భీమవరం అర్బన్: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దూరమై పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీఎల్ఎం లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే కాంక్షతో గుడ్లు, పాలు, అటుకులు, చిక్కీలు, కందిపప్పు, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత రాకుండా ప్రతి వారం వైద్యం పరీక్షలు ద్వారా ఐరన్ ఫోలిక్ మాత్రలు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఇస్తున్నారని తెలిపారు. పౌష్టికాహారంలో ప్రొటీన్లు, విటమిన్లు ఎంత మోతాదులో ఉంటాయో ఎప్పుడు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మండల కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ అనిల్ కుమారి, సరళ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఆకివీడు: నగర పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ జామి హైమావతి మంగళవారం చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లందరూ హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.

హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలి

సాక్షి, భీమవరం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలో చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఈ సంద్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు నిర్మించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, ఎయిడెడ్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతోన్న విద్యార్థులకు కూడా విద్యా దీవెన వసతి, దీవెన అమలు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

చిత్రలేఖన పోటీల విజేతలు వీరే



బహుమతులకు ఎంపికైన చిత్రాలు

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీజీ సత్యం – అహింస విధానాలు నాడు – నేడు అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతల వివరాలను మంగళవారం మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు వెల్లడించారు. జూనియర్స్ విభాగంలో టీడీఎస్ శ్రావణి (మేడపాడు), శ్రీనిధిలాస్య (భీమవరం), వి.జ్యోతివైష్ణవి (దండగర్ర), సీనియర్స్ విభాగంలో ఎం శ్రీలక్ష్మి అనూహ్య శ్యామలాంబిక (పెదనిండ్రకొలను), నక్కా ఎస్తేరురాణి (పాలకోడేరు), బీసీహెచ్ శరవన్ (ఏలూరు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. కళాశాల విభాగంలో కె.సుష్మిత (భీమవరం), జె.శ్యామలగౌరి (భీమవరం), పీసీహెచ్‌కే నాగవినయ్ (నూజివీడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. విజేతలకు అక్టోబర్ 2న పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎలుకల నివారణకు మందు పంపిణీ



యనమదుర్రులో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న దృశ్యం



మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సీతారామయ్య



ఉండిలో రైతులకు ఎలుకల మందు అందజేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణ

భీమవరం అర్బన్: వ్యవసాయ సాగులో ఎలుకలను మట్టుబెట్టకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నూకలు, నూనె కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలుకలు వరి దుబ్బు మొదళ్లను కొరికేసి పంటను నాశనం చేస్తాయన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధారిత గ్రామాల్లో ఎలుకలు మందును ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో వీఏఈలు, రైతులు, తదితరులు పాల్గొన్నార

ఎలుకే కదా అని వదిలేస్తే.. పంటలకు నష్టం

ఆకివీడు: ఎలుకే కదా అని వదిలేస్తే... బస్తాలకు బస్తాలు ధాన్యం బొక్కేస్తాయని, దిగుబడి తగ్గిపోతుందని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య చెప్పారు. స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు బ్రొమోడైన్ మందును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో ఎలుకల బెడద అధికంగా ఉంటుందన్నారు. ఒకటి, రెండు ఎలుకలుంటే అవి నెలలోనే పదుల సంఖ్యలో పిల్లల్ని పెడతాయన్నారు. పొలాల్లోనూ, గట్లపైన ఎలుకలు బొరియలు ఏర్పాటు చేసి వాటి సంతతిని పెంచుకుంటాయన్నారు. వరి పొట్ట దశ, పాలు పోసుకునే దశలో ఎలుకుల ఉధృతి అధికంగా ఉంటుందని చెప్పారు. ఏడీఏ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలుక కొట్టుడు ద్వారా ఎకరాకు రెండు నుంచి నాలుగు బస్తాల వరకూ దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని చెప్పారు. దీనివల్ల రైతులకు అధిక నష్టం వాటిల్లుతుందన్నారు. వరి కుదుళ్లలో కొత్తగా వచ్చే పిలకల్ని, పొట్ట దశలో మొవ్వును కొట్టివేస్తాయన్నారు. దీనివల్ల పిలకల శాతం తగ్గిపోతుందన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన ద్వారా దిగుబడులను కాపాడుకోవాలని ఏడీఏ సూచించారు. మండల వ్యవసాయ అధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌లో 3,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టినట్లు చెప్పారు. రైతులు ముందుగా గుర్తించిన ఎలుక కన్నాల్లో నూకలు, నూనెతో బ్రొమోడైన్ కలిపిన మందును కొద్దిగా వేసి మట్టితో పూడ్చి పెట్టాలన్నారు. అధికంగా నూకలు వేసినప్పటికీ మందును తినకుండా తప్పించుకు తిరుగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఆర్బీకే చైర్మన్ కేశిరెడ్డి దుర్గారావు, నంద్యాల చల్లారావు, మాజీ ఉపసర్పంచ్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే జగనన్న ధ్యేయం

ఉండి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి బీ సంధ్య ఆధ్వర్యంలో ఉండి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ (తెల్లమందు)ను ఎంపీపీ చేతుల మీదుగా రైతులకు ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం సమర్థవంతంగా, సామూహికంగా నిర్వహిస్తేనే విజయవంతం అవుతుందని అన్నారు. ఎలుకల మందును పంట పొలాల్లో మాత్రమే కాకుండా కాలువ గట్లు, బంజరు భూములు, చెరువు గట్ల వద్ద ఉన్న బొరియల్లో పెట్టాలన్నారు. ఏఓ సంధ్య మాట్లాడుతూ ఎలుకల వల్ల వరి పంటకు కలిగే అనర్థాలను వివరించారు. సర్పంచ్ సౌజన్యబెనర్జీ, ఎంపీటీసీ కునుకు రమాదేవి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా దొరగారి చెరువు అభివృద్ధి పనులు

- చుట్టూ కాలిబాట నిర్మాణం
- ఫెన్సింగ్, చుట్టూ రివిట్‌మెంట్ నిర్మాణం



స్థానిక దొరగారి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువులోని తూడు, జమ్ము తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతోన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో తూడు, జమ్ముతో మురుగునీటికి నిలయంగా మారిన దొరగారి చెరువును అభివృద్ధి చేసేందుకు గత నెలలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం, ఏపీ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ నిధులు రూ. 62 లక్షల వ్యయంతో చెరువును ఆధునీకరిస్తున్నారు. చెరువును మంచినీటి చెరువుగానూ, చుట్టూ గట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం, గట్టుపై కాలిబాట రహదారి నిర్మాణంతో పాటు ఫెన్సింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే చెరువు గట్టును శుభ్రం చేసి కాలిబాట కోసం గ్రావెల్ పనులు పూర్తి చేశారు. గ్రావెల్‌పై మిక్సర్ చిప్స్ వేసి నడక మార్గానికి అనువుగా అభివృద్ధి చేస్తారు. చెరువులో తూడు, జమ్మును తొలగిస్తున్నారు. భారీ పొక్లైన్‌తో పనులు ప్రారంభించారు. చెరువులోని పూడిక తొలగించి మంచినీటిని నింపనున్నారు. చెరువును ఆహ్లాదకరంగా తీర్చి చర్యల్లో భాగంగా పనులు వేగంగా జరగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో మూడు దశాబ్దాలుగా మంచినీటి చెరువు కలుషితానికి గురై మూలన పడి ఉంది. దొరగారి చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మంచినీరు అందిస్తానని ఎన్నికల్లో పీవీఎల్.నర్సింహారాజు ఇచ్చిన హామీని నెరవేర్చుతుండటంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సదస్సుల్లో పాల్గొంటే మంచి ఫలితాలు



విజయ్‌కృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అంతర్జాతీయ సదస్సుల్లో అధ్యాపకులతో పాటు విద్యార్థులు కూడా పాల్గొంటే మంచి ఫలితాలు వస్తాయని భువనేశ్వర్ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ విజయ్ కృష్ణ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నానో టెక్నాలజీ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల మెటీరియల్స్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ (ఎంఈసీఏపీ) అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైన్సెస్, ఇంజినీరింగ్‌లో మెటీరియల్ ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు అధ్యాపకులు, విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా సదస్సులో పాల్గొనటం అభినందనీయమన్నారు. విజయ్‌కృష్ణను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమానికి టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ హెడ్ వేణురెడ్డి అధ్యక్షత వహించగా కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, పి.భవాని, పి.రామ్మూర్తి రాజు, సోమేశ్వరరావు, దివాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలంపురంలో 28న ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: ఈనెల 28న పెంటపాడు మండలం అలంపురం గ్రామంలోని వెంకట రమణసేవాఛారిటీ ఉచిత ఆసుపత్రికి జీఎస్ఎల్ వైద్యులు రానున్నట్లు ట్రస్టు నిర్వాహకులు పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసన్ వైద్యులు, అంకాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల డాక్టర్లు వచ్చి రోగులకు ఉచిత వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. గుండె వ్యాధులకు సంబంధించి ఈసీజీ, ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉచితంగా తీస్తారన్నారు. రాజమండ్రి జనరల్ ఆసుపత్రికి ప్రతి శుక్రవారం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీఓ



ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీఓ దాసి రాజు, డీఈ ఎం.శ్రీనివాస్ యాదవ్

ఆకివీడు: రోడ్డు నిర్మాణం కోసం మార్జిన్లలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై వచ్చిన ఆరోపణలతో ఆ ప్రాంతాన్ని మంగళవారం భీమవరం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. తరటావ నుంచి కొల్లేరు వెళ్లే రహదారిని అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టేందుకు రూ.25 కోట్ల వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు విస్తరణ పనులకు ఆక్రమణలు అడ్డు రావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయా ప్రాంతాల్ని పరిశీలించారు. ఆక్రమణదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణకు అనువైన ప్రాంతాన్ని తీసుకునే విధంగా సమస్యను పరిష్కరించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ యాదవ్, జేఈ శ్రీహరి, తహసీల్దార్ విజయలక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల నిర్మించిన సమావేశపు హాలుపై ఫిర్యాదులు రావడంతో దాతల్ని పిలిచి వారితో ఆర్డీఓ రాజు మాట్లాడారు. తాము షెడ్డు నిర్మాణానికి విరాళాలు అందించామని దాతలు చెప్పారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన జాబితా, దాతల వివరణల్ని తీసుకున్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారితోట అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం ఉదయం గుండె ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దలను కార్డియో తోరాసిస్ సర్జన్, స్థానిక తేజ హాస్పిటల్ అధినేత పానమండ చంద్రశేఖర వర్మ, 15 సంవత్సరాల్లోపు పిల్లలను విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ పిల్లల గుండె వైద్య నిపుణుడు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పరిశీలించి ఈసీజీ, ఎకో, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. వైద్య సేవలు అందించారు. ఏబీఎస్‌వీకేకు సహకరిస్తోన్న వసుధ ఫౌండేషన్‌కు, డెక్కన్ ఫైన్ కెమికల్ (పి) లిమిటెడ్ సంస్థకు, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ (హైదరాబాద్)కు, వైద్య సేవలు అందించిన డాక్టర్లకు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు అభినందనలు తెలిపారు. హాస్పిటల్ ప్రతినిధి రణదివే తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధన

పెనుగొండ: గణపతి నవరాత్రుల్లో భాగంగా మంగళవారం మండలంలోని పలు చలువ పందిళ్లలో కొలువుదీరిన గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధాంతం చింతలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన వినాయక నిమజ్జనం పూర్తి కావడంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. చింతలపాలెం సంఘ పెద్దలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని ఐదో వార్డు ఇంచార్జి కాకర్ల శ్రీను అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో జరిగాయి. పరుగు పందెం, తదితర ఆటలను ఆడించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ మండల స్థాయి గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయిలో పంపిస్తామని తెలిపారు. గెలుపొందిన వారికి సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో బహుమతులు ఉంటాయని తెలిపారు. ఉపాధ్యాయిని కె.కుమారి, ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

అత్తిలి: గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్‌లు నిర్మిస్తున్నామని సర్పంచ్ గంటావిజేత నాగరాజు చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సహకారంతో రూ. 30 లక్షలు పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అత్తిలి గ్రామంలో 17వ వార్డు చినపేటలో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయిన్‌లు చేపట్టగా ఇప్పటికే రూ. 23 లక్షలు వ్యయంతో పనులు పూర్తిచేయగా, మరో రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ గంటావిజేత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందన్నారు.

ఆటో యూనియన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న గ్రంధి రవితేజ

సాక్షి, భీమవరం: ఆటో కార్మికులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నేత గ్రంధి రవితేజ అన్నారు. మంగళవారం భీమవరం చైతన్య ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ ఐక్యతతోనే ప్రగతి సాధించవచ్చుననడానికి ఆటో వర్కర్స్ అసోసియేషన్ నిదర్శమన్నారు. రవాణా శాఖ అధికారులు సీహెచ్ రమణ, కేఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, నిబంధనలు పాటించాలని సూచించారు. తొలుత కొత్త బస్టాండ్ నుంచి ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కడలి హరిబాబు, వనం సోమేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొక్కా శ్రీనివాసరావు, సలహాదారులు చెరుకువాడ రంగసాయి, మెంటే పార్థసారధి, న్యాయవాది పి.రాజారావు, కొటికలపూడి బాబు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు యింటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ది.ఉండి విశాల సహకార సంఘం లిమిటెడ్ నెం.355 W.G. రు ఉండి

మహాజన సభ నోటీసు

ది.29.09.2023 తేదీ శుక్రవారం మధ్యాహ్నం [illegible]

[illegible]

సం/- ఉ.ఎ.వి.ఎస్.వి. ప్రసాద్ [illegible]

సం/- పెనుమత్స సూర్యనారాయణ రాజు [illegible]

ఎజెండా

1) [illegible]
2) ది.1-4-2023 నుండి 31-8-2023 వరకు [illegible]
3) 2022-2023 వ సంవత్సరముల [illegible]
4) 2022-2023 వ సంవత్సరముల [illegible]
5) 2022-2023 సంవత్సరమునకు [illegible]
6) [illegible]